సంపుటి : 10
సంచిక : 06
శుక్రవారం
02 అక్టోబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వంవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

10 YEARS CELERRATING




Contact For Ads:
7579339999

## రాయలసీమ దశ మార్చేలా

# గ్లోబల్ హార్టీకల్చర్ హబ్



- రూ.1 లక్ష కోట్ల భారీ బడ్జెట్‌తో మూడు దశల్లో ప్రాజెక్టు అమలు
- మదనపల్లెలో నిర్మల, చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా పనుల ప్రారంభం
- భారత్‌లోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన
- పది జిల్లాల్లో ఉద్యాన సాగు విస్తరణ.. 9.6 లక్షల మంది రైతులకు లబ్ధి

**రాయలసీమ, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయలసీమ రూపురేఖలను సమూలంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతాన్ని దేశానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' ఏర్పాటుకు అంకురార్పణ చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్టు పనులను లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ. 1 లక్ష కోట్ల భారీ వ్యయంతో మూడు దశల్లో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 40,352 కోట్లు భరించనుండగా, ప్రైవేటు రంగం నుంచి రూ. 60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. రాయలసీమ, ప్రకాశం ప్రాంతాల్లోని 10 జిల్లాలకు చెందిన 303 మండలాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. 'విత్తనం నుంచి ఎగుమతి వరకు' (సీడ్ టు షిప్‌మెంట్) అనే సమగ్ర విధానంతో మిగతా .. 2లో..

## అరకును గ్లోబల్ కాఫీ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం..

### సీఎం చంద్రబాబు



**అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** అరకును ప్రపంచ స్థాయి కాఫీ కేంద్రంగా (ప్రీమియర్ గ్లోబల్ కాఫీ డెస్టినేషన్) తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రియాశీలకంగా పెట్టుబడులు మిగతా .. 2లో..

## 9/11 తరహా మారణహోమాన్ని

# భారతీయుడు నివారించాడు

### ప్రధాని నరేంద్ర మోదీ



**అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రాణాలకు తెగించి 174 మందిని కాపాడిన ఫ్లైదుబాయ్ పైలట్, భారతీయుడు స్మిత్ మచ్చర్‌పై అంతర్జాతీయంగా ప్రశంసలు కురుస్తున్నాయి. ప్రధాని మోదీ మరోసారి ఆయన్ను కొనియాడారు. 9/11 తరహా మారణహోమాన్ని భారతీయుడు నివారించారని అభినందించారు. యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దిల్లీలో జరిగిన కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. "నిన్న జరిగిన ఘటనలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ అసాధారణ సహనం, సమయస్ఫూర్తి, ధైర్యంతో స్పందించారు. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్టుగా.. ఒక భారతీయుడు 9/11 తరహా మారణహోమాన్ని నివారించారు. ఆయన మన దేశ గౌరవాన్ని పెంచారు" అని ప్రధాని పేర్కొన్నారు.

**కెప్టెన్.. మీరు మా అందరికీ హీరో: స్పైస్‌జెట్**

ఫ్లైదుబాయ్ విమానయాన సంస్థలో చేరకముందు.. మచ్చర్ స్పైస్‌జెట్‌లో విధులు నిర్వర్తించిన సంగతి తెలిసిందే. తాజా ఘటన నేపథ్యంలో మిగతా .. 2లో..

## విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్



**చౌటుప్పల్, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ – విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ప్రజలు సొంతూళ్లకు క్యూ కట్టారు. దీనికి తోడు రోడ్డు పనులు జరుగుతుండటంతో రద్దీ పెరిగింది. చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్ పేట– కొయ్యలగూడెం మధ్య మిగతా .. 2లో..

## బీసీలకు 34% రిజర్వేషన్లు

# జీవోల రద్దు

### ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు




**అమరావతి, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని మిగతా .. 2లో..

# నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదలకు ఆదేశం

### అధికారులకు మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు - పదో తరగతి ఫలితాల కోసం 'మిషన్ మార్చ్' పకడ్బందీగా అమలు



**ఉండవల్లి, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల రోజుల్లోపు డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి పోస్టింగ్ ఉత్తర్వుల జారీ వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. ఏపీ రిక్రూట్‌మెంట్ మోడల్‌ను దేశం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని, ఇతర రాష్ట్రాలు మన విధానాలను అనుసరించేలా సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు. పాఠశాల విద్యలో కీలక సంస్కరణలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. బడి మానేసే పిల్లల సమస్యపై సింగపూర్ హోంమంత్రి షణ్ముగం చేసిన మిగతా .. 2లో..

## సర్ ప్రక్రియ గడువు మళ్లీ

# పొడిగించే ఉద్దేశం లేదు

### తెలంగాణా రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 65 లక్షల మంది మిగతా .. 2లో..

# ఆ పైలట్‌కు 'ఉగ్ర' భావజాలం

### ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు



**అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫ్లైదుబాయ్ విమానంలో దాడికి పాల్పడిన పైలట్.. ఉగ్రవాద భావజాలానికి లోనయ్యాడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. అయితే.. అతడు ఆ భావజాలం వైపు మళ్లడం వెనుక ఎవరి మిగతా .. 2లో..

## నీటి వనరులను కలుషితం చేసే

# హక్కు ఎవరికీ లేదు

### ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**అమరావతి, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** నీటి వనరులను కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏఐ) ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రతినిధులు డిప్యూటీ సీఎంను కలిశారు. ఈ సందర్భంగా ఆక్వా ప్రాసెసింగ్, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు పాటించాల్సిన పర్యావరణ నిబంధనలపై పవన్ సమీక్షించారు. ఏ పరిశ్రమ అయినా మిగతా .. 2లో..

## 'వానిష్' కుమార్‌ను

# ప్రజలు క్షమించరు

### సీఈసీపై మమత ఫైర్



**అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ ఓటు హక్కును కాలరాసిన వారిని దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను 'వానిష్' కుమార్ అంటూ ఎద్దేవా చేశారు. ఆయన ప్రజల హక్కులను వానిష్ (మాయం) చేశారని ఆరోపించారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈమేరకు మాట్లాడారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం కేంద్రీకృతం చేసిందని విమర్శించారు. 2023 నాటి చట్టం కింద సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్లకు కల్పించిన రక్షణను ప్రశ్నించారు. "పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ప్రక్రియను టీఎంసీ మొదటి నుంచే వ్యతిరేకించింది. ఈ వ్యవహారంలో కోర్టును ఆశ్రయించినా న్యాయం జరగలేదు. దాదాపు మిగతా .. 2లో..

## ఫ్లైదుబాయ్ ఘటన..

# యూఏఈకి స్మిత్ మచ్చర్ ఎయిర్‌లిఫ్ట్



**అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో జరిగిన దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు ఎయిర్‌లిఫ్ట్ చేశారు. దుబాయ్–ఇజ్రాయెల్ విమానంలో కో–పైలట్ దాడి తర్వాత విమానం సౌదీ అరేబియాలో సురక్షితంగా ల్యాండ్ అయిన సంగతి తెలిసిందే. విమానం దిగిన వెంటనే మచ్చర్‌ను అక్కడి మిలిటరీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఇప్పుడు తదుపరి వైద్యం కోసం యూఏఈకి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని సౌదీలోని భారత రాయబార కార్యాలయం ఇప్పటికే వెల్లడించింది.

**'గుజరాతీ వీరపుత్రుడు'..**

మరోవైపు, స్మిత్ మచ్చర్ తెగువకు గుర్తింపుగా గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్.. రాష్ట్ర పురస్కారమైన 'విశిష్ట గుజరాత్ గరిమా' అవార్డును ప్రకటించారు. గుజరాత్‌కు చెందిన ఈ ధైర్యశాలి.. తన వీరత్వంతో రాష్ట్రం, దేశం కీర్తిని ఇనుమడింపజేశారని ప్రశంసించారు. "గుజరాతీ వీరపుత్రుడు కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు మిగతా .. 2లో..






(మొదటిపేజీ తరువాయి)

## భారతీయుడు నివారించాడు

స్పైస్‌జెట్ స్పందించింది. "షైదుబాయ్ విమానంలో కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ఎన్నో ప్రాణాలను కాపాడాయి. ఆయన స్పైస్‌జెట్‌లో 10 ఏళ్లపాటు పనిచేశారు. ఆయన ధైర్యం, నిస్వార్థ సేవ.. స్పైస్‌జెట్‌లో మేము అమూల్యంగా భావించే విలువలకు నిజమైన ప్రతిరూపం. ఆయన త్వరగా కోలుకోవాలని మేం కోరుకుంటున్నాం. కెప్టెన్.. మీరు మా అందరికీ హీరో" అని ఎయిర్‌లైన్ కొనియాడింది.

## విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్

భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇరువైపులా కిలోమీటర్ల దూరం వాహనాలు నిలిచిపోయి.. నెమ్మదిగా కదులుతున్నాయి. తూప్రాన్ పేట నుంచి బొర్రలగూడెం వరకు జాతీయ రహదారిపై తారు వేసే పని చేపట్టారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వాహనాలు వచ్చే రోడ్డుపైకి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను మళ్లించారు. దీంతో సమస్య మరింత జఠిలమైంది. ఈ రహదారిపై రోజుకు సుమారు 40 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. విజయవాడ వైపు వెళ్లే రోడ్డుపై నిర్మాణ పనులు జరుగుతుండడంతో అటువైపు వెళ్లే 20వేల వాహనాలను దారి మళ్లించడంతో రద్దీ ఏర్పడింది. హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డు పైనే... మధ్యలో తాత్కాలిక బారికేడ్లను ఏర్పాటుచేసి విజయవాడ వైపున కూడా ఎదురెదురుగా వాహనాలను నడిపిస్తున్నారు. ఈ రోడ్డు సరిపోకపోవడంతో తూప్రాన్ పేట నుంచి బొర్రలగూడెం వరకు నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు గంటన్నరకు పైగా సమయం పడుతోంది. చౌటుప్పల్ పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండడంతో ఇక్కడ సైతం ట్రాఫిక్ రద్దీ కొనసాగుతోంది. నిర్మాణ పనులు వేగవంతం చేసి ట్రాఫిక్ సమస్యను త్వరగా పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

## బీసీలకు 34% రిజర్వేషన్లు జీవోల రద్దు

ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది. అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది. మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.

## నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదలకు ఆదేశం

సూచనలను ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో 'జీరో డ్రాప్ అవుట్ మిషన్' చేపట్టాలని సూచించారు. డ్రాపౌట్ల నివారణలో సమాజంలోని పెద్దలను, స్థానిక ప్రముఖులను భాగస్వాములను చేయాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఉన్నత విద్యారంగంపై కూడా సమీక్షించిన లోకేశ్, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిందని, డిసెంబరులో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రాత పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. రాష్ట్రంలో పలు ప్రతిష్ఠాత్మక ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని, వాటికి అవసరమైన భూమిని గుర్తించాలని మంత్రి సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో విశాఖపట్నంలో పబ్లిక్ లైబ్రరీ భాగస్వామ్యంతో ఒక ప్రతిష్ఠాత్మక గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 125 ఆటిజం సెంటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హక్కు ఎవరికీ లేదు

పర్యావరణానికి, సమాజానికి హాని కలిగించటం ఆమోదయోగ్యం కాదన్నారు. కాలుష్యాన్ని మొదట్లోనే నివారించడం అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. ఆక్వా వ్యర్థాల కారణంగా సహజ నీటి వనరులు, భూగర్భజలాలు కాలుష్యం బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతీ పరిశ్రమ నిర్దేశిత ప్రమాణాలు తప్పక పాటించి తీరాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 128 ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా.. 82 యూనిట్ల నుంచి నమూనాలు సేకరించి పరీక్షించామని ఈ సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ పవన్ దృష్టికి తీసుకెళ్లారు. అందులో 49 యూనిట్లు ప్రమాణాలను పాటించడం లేదన్నారు. ఇది జలవనరులపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. దీనిపై పవన్ స్పందిస్తూ.. ఇష్టారాజ్యంగా నిబంధనలు ఉల్లంఘించడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఆక్వా పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు నీటి వనరులను కలుషితం చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల జీవనాధారానికి, వ్యవసాయానికి, మత్స్య సంపదకు, పర్యావరణ వ్యవస్థలకు ఈ నీటి వనరులే అత్యంత కీలకమన్నారు. పరిశ్రమలు నిర్దేశిత ప్రమాణాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. పారిశ్రామిక అభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ తెలిపారు. ఆక్వా ప్రాసెసింగ్ పరిశ్రమలకు సంబంధించిన సమస్యలపై చర్చించేందుకు మత్స్యకార ప్రతినిధులు, ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించి, పర్యావరణ నిబంధనల అమలు, ప్రాసెసింగ్ రంగాల స్థిరమైన అభివృద్ధి గురించి చర్చిస్తామని తెలిపారు.

## 'వానిష్' కుమార్‌ను ప్రజలు క్షమించరు

100 మంది 'సర్' బాధితులతో కలిసి ఎన్నికల సంఘం అధికారులను కలిసేందుకు వెళ్తే.. వారు మమ్మల్ని అవమానించారు. సీఈసీని కలిసేందుకు వెళ్లిన టీఎంసీ ఎంపీలను 'వెళ్లిపోండి' అని అన్నారు" అని మమత ఆరోపించారు. రాష్ట్రంలో దాదాపు 4,000 ఈవీఎంలను తగలబెట్టిన ఘటనల వెనుక భాజపా హస్తం ఉందని ఆరోపించారు. టీఎంసీ శ్రేణులు బెంగాల్‌లో తీవ్ర ఆంక్షలు, వేధింపులను ఎదుర్కొంటున్నాయని దీదీ పేర్కొన్నారు. "కోర్టు అనుమతి లేకుండా నేను ఇంటి నుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేదు. సమావేశాలు నిర్వహించేందుకు మా పార్టీకి అనుమతి ఇవ్వడం లేదు. మా కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. నా నివాసం వద్ద కనీస భద్రత లేదు. రోజూ 200-300 మంది దుండగులు నా ఇంటి ముందుకొచ్చి హంగామా చేస్తున్నారు. రాత్రి 8 గంటల తర్వాత బయట రోడ్ల మీద ఎవరూ తిరగలేని పరిస్థితి ఉంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

## పొడిగించే ఉద్దేశం లేదు

నోటీసులకు సమాధానం ఇచ్చారని, 54 లక్షల మందిని తుది జాబితాలోకి తీసుకున్నామని వెల్లడించారు. "ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80వేల మందికి నోటీసులు ఇచ్చాం. నోటీసులు అందుకున్న వారిలో 20శాతం మంది సమాధానాలు ఇచ్చారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకే బీఎల్‌వోలు వెళ్లి సంబంధిత పత్రాలు తీసుకుంటారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ ఉండాల్సిన పనిలేదు.. ఒక్కరే మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుంది. సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదు" అని సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

## ఆ పైలట్‌కు 'ఉగ్ర' భావజాలం

ప్రమేయం ఉందనే విషయం మాత్రం తమకు తెలియదన్నారు. దీని వెనుక ఇరాన్ హస్తం ఉందా? అనే ప్రశ్నపై స్పందిస్తూ.. ఇప్పుడే చెప్పడం తొందరపాటే అవుతుందన్నారు. మరోవైపు.. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. "ఉగ్రవాదం నుంచి మానసిక సమస్యల వరకు.. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోంది. ప్రస్తుతానికి దేన్నీ కొట్టిపారేయడం లేదు" ఓ అధికారి తెలిపారు. పైలట్ ఉద్దేశాన్ని తెలుసుకునేందుకు సౌదీ అధికారులు ఇజ్రాయెల్ సహా పలు దేశాలతో కలిసి పనిచేస్తున్నారని చెప్పారు. యూఏఈ, అమెరికా, ఒమన్ కూడా పాలుపంచుకుంటున్నాయని వెల్లడించారు. విచారణ నిమిత్తం ఆ పైలట్‌ను తమకు అప్పగించాలని సౌదీకి ఇజ్రాయెల్ విజ్ఞప్తి చేసిందన్నారు. యూఏఈ సైతం సొంత దర్యాప్తు ప్రారంభించింది. ఆ విమానం తమ దేశంలో రిజిస్టర్ అయి ఉందని, అందులో జరిగే నేరాలకు తమ చట్టం వర్తిస్తుందని పేర్కొంది. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు నెతన్యాహు తెలిపారు.

**స్మిత్ మచ్చర్ కోలుకుంటున్నారు..: భారత ఎంబసీ**

ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భారత పైలట్ స్మిత్ మచ్చర్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం మెరుగ్గా ఉందని, ఆయన కోలుకుంటున్నట్లు యూఏఈలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మచ్చర్‌తోపాటు ఆయన కుటుంబాన్ని స్థానిక భారత రాయబారి దీపక్ మిత్తల్ పరామర్శించినట్లు తెలిపింది. వైద్య సేవల విషయంలో స్థానిక అధికారులతో ఎంబసీ సమన్వయం చేసుకుంటోందని పేర్కొంది. తొలుత సౌదీ అరేబియాలోని తబూక్‌లో చికిత్స పొందిన స్మిత్‌ను నేడు యూఏఈకి తరలించిన విషయం తెలిసిందే.

## యూఏఈకి స్మిత్ మచ్చర్ ఎయిర్‌లిఫ్ట్

యావత్ ప్రపంచం సెల్యూట్ చేస్తోంది. తీవ్ర గాయాలపాలై రక్తంతో తడిసిపోయినప్పటికీ.. 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన చూపిన అసమాన ధైర్యసాహసాలు ఎంతో స్ఫూర్తిదాయకం, ప్రశంసనీయం. ఆయన నరనరాల్లో ప్రవహిస్తున్న గుజరాతీ స్ఫూర్తి మనందరికీ గర్వకారణం. స్మిత్ మచ్చర్ ధైర్యసాహసాలు, మానవతా దృక్పథాన్ని గౌరవిస్తూ.. మా ప్రభుత్వం 'విశిష్ట గుజరాత్ గరిమా' అవార్డును ప్రదానం చేయనుంది. ఆయన త్వరగా కోలుకోవాలని రాష్ట్రం మొత్తం ప్రార్థిస్తోంది" అని భూపేంద్ర పటేల్ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ఇక, స్మిత్ మచ్చర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రఖ్యాత సోమనాథ్ ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహామృత్యుంజయ మంత్ర జప అనుష్ఠానం ప్రారంభించారు.

## కాఫీ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతాం..

పెడుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉదయం ఒక కప్పు కాఫీ తాగనిదే కోట్లాది మందికి రోజు ప్రారంభం కాదని, తన దినచర్య కూడా అరకు కాఫీతోనే మొదలవుతుందని చంద్రబాబు 'ఎక్స్' వేదికగా తెలిపారు. "అరకు.. ఆంధ్రప్రదేశ్ ఘనమైన వారసత్వ సంపదకు ప్రతీక. మన రాష్ట్రంలోని కొండ ప్రాంతాల నుంచి ప్రపంచవ్యాప్తంగా కాఫీ కప్పుల వరకు అరకు కాఫీ సాగించిన అద్భుత ప్రయాణాన్ని ఈ అంతర్జాతీయ కాఫీ దినోత్సవం రోజున జరుపుకుందాం" అని ఆయన పేర్కొన్నారు. స్థానిక రైతులను ప్రోత్సహిస్తూ, ప్రపంచ కాఫీ పటంలో ఆంధ్రప్రదేశ్‌కు సరైన స్థానం కల్పించడమే తమ లక్ష్యమని చంద్రబాబు వివరించారు. ఇదే సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అంతర్జాతీయ కాఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అరకు కాఫీ విశిష్టతను వివరిస్తూ, "ప్రతి కప్పు అరకు కాఫీలో తూర్పు కనుమల సౌరభం, అక్కడి నేల సారం, మన గిరిజన రైతుల కఠోర శ్రమ ఇమిడి ఉన్నాయి" అని అన్నారు. అరకు కాఫీ కేవలం రుచి, సువాసనలకు మాత్రమే పరిమితం కాదని, అది మన అడవులు, గిరిజన సంఘాలు, వారి సంప్రదాయ జ్ఞానం మధ్య ఉన్న బంధానికి ప్రతీక అని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్న ఈ స్థానిక ఉత్పత్తి, అరకు లోయల నుంచి ఢిల్లీలోని పార్లమెంట్ వరకు ప్రయాణించిందని, అక్కడ ప్రత్యేక స్టాళ్ల ద్వారా ప్రదర్శించబడిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా అరకు కాఫీని, దాని సాగుతో ముడిపడి ఉన్న గిరిజన కుటుంబాల కృషిని పలుమార్లు ప్రశంసించారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ఒక కప్పు అరకు కాఫీ అంటే మన నేల రుచి, మన ప్రజల కథ, మన తూర్పు కనుమల సువాసన" అని పవన్ కల్యాణ్ అభివర్ణించారు. మొత్తంగా, అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర నాయకత్వం అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించింది.

## గ్లోబల్ హార్టి కల్చర్ హబ్

ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన సాగును మరో 6 లక్షల హెక్టార్లకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వార్షిక ఉత్పత్తిని 222 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 435 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం ద్వారా సుమారు 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా సాగునీటి వనరులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల అనుసంధానం, లాజిస్టిక్స్ వంటి కీలక మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది. మామిడి, అరటి, దానిమ్మ, టమాటాతో పాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి విభిన్న తరహా పంటల సాగును కూడా ప్రోత్సహించనున్నారు.

**దేశంలోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్**

ఈ కార్యక్రమంలో భాగంగా మదనపల్లెలోనే దేశంలోనే మొట్టమొదటి 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పారిశ్రామిక రంగంలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' (ఐఎస్‌బీ) తరహాలోనే, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో ఈ సంస్థ కార్యకలాపాలు సాగించనుంది. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మార్కెట్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించి ఈ సంస్థ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తుంది. తద్వారా 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో 'ఫ్రూట్ బౌల్'గా కూడా నిలపాలన్నది ప్రభుత్వ దృఢ సంకల్పంగా స్పష్టమవుతోంది.

**రేపల్లెలో డ్వాక్రా మహిళ జేజమ్మతో సీఎం చంద్రబాబు ముఖాముఖి**

స్వయం సహాయక సంఘాల ద్వారా లభించే రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో చిరు వ్యాపారాలు ప్రారంభించి, ఆధునిక సాంకేతికతను జోడించి వాటిని విస్తరించుకోవాలని ఆయన సూచించారు. బాపట్ల జిల్లా రేపల్లెలో నిర్వహించిన 'పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా, రేపల్లె పట్టణంలోని 4వ వార్డులో 'శ్రీలక్ష్మి కిరాణా జనరల్ స్టోర్' యజమాని జి. జేజమ్మతో పాటు ఇతర డ్వాక్రా మహిళలతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. డ్వాక్రా గ్రూప్ బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.2 లక్షల రుణం పొంది, తన కిరాణా దుకాణాన్ని విస్తరించినట్లు జేజమ్మ ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్' నినాదం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆమె పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి వాట్సాప్ ద్వారా ఆర్డర్లు సేకరించి, తన భర్త శ్రీనివాసరావు సహాయంతో నేరుగా ఇళ్లకే డెలివరీ చేస్తున్నామని తెలపడంతో చంద్రబాబు వారి పనితీరును అభినందించారు. ఇదే క్రమంలో పలువురు డ్వాక్రా మహిళలు తమ వ్యాపార ఆలోచనలను, భవిష్యత్తు ప్రణాళికలను ముఖ్యమంత్రితో పంచుకున్నారు. వాట్సాప్ బిజినెస్ వినియోగంపై మహిళలకు ఉన్న అవగాహనను అడిగి తెలుసుకున్న చంద్రబాబు, నూతన వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం, జేజమ్మ మామగారైన వెంకటరావుకు ముఖ్యమంత్రి స్వయంగా వృద్ధాప్య పింఛను అందజేశారు. పర్యటన ముగింపులో ఆయన డ్వాక్రా మహిళలతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

---

కూతురు పొలిటికల్ ఎంట్రీ ప్రచారంపై

## మంత్రి నారాయణ క్లారిటీ

**తన కూతురు షరణి మేయర్‌గా పోటీ చేయదని నారాయణ స్పష్టీకరణ**

**తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని వెల్లడి**

**ప్రజా సేవ చేయడానికే తాను రాజకీయాల్లోకి వచ్చానన్న మంత్రి**



**నెల్లూరు, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** తన కుమార్తె షరణి రాజకీయ ప్రవేశంపై వస్తున్న వదంతులకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ తెరదించారు. తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని, తన కుమార్తె మేయర్‌గా పోటీ చేస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ ఈ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేశారు. తనపై ఎన్ని ఆరోపణలు వచ్చినా తాను పట్టించుకోనని మంత్రి నారాయణ అన్నారు. "కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది" అంటూ తనపై విమర్శలు చేస్తున్న వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాను ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని తెలిపారు. అంతకుముందు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి నారాయణ వివరించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో వేలాది మందికి శాశ్వత నివాస ధ్రువీకరణ పట్టాలు అందించామని చెప్పారు. నెల్లూరులో ఇప్పటికే 1,450 మందికి పట్టాలు ఇచ్చామని, త్వరలోనే మరో 1,250 మందికి అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## యూట్యూబర్ రావణ్‌కు షాక్

**దర్యాప్తు గడువు మరో 30 రోజుల పొడిగింపు**

**విజయవాడ, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** యూట్యూబర్ రావణ్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద నమోదైన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు గడువును మరో 30 రోజుల పాటు పొడిగిస్తూ కృష్ణా జిల్లా కోర్టు ఈరోజు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, ప్రశ్న రావణ్‌పై నమోదైన ఉపా కేసులో చట్ట ప్రకారం నిర్దేశించిన 90 రోజుల దర్యాప్తు గడువు రేపటితో (అక్టోబర్ 2) ముగియనుంది. ఈ నేపథ్యంలో, కేసులో మరింత లోతైన విచారణ జరిపి, కీలక ఆధారాలు సేకరించేందుకు అదనపు సమయం అవసరమని దర్యాప్తు అధికారులు భావించారు. ఈ మేరకు గడువును పొడిగించాలని కోరుతూ కృష్ణా జిల్లా కోర్టులో ప్రత్యేక పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం, దర్యాప్తు అధికారుల విజ్ఞప్తిని అంగీకరించింది. విచారణ పూర్తి చేయడానికి మరో 30 రోజుల గడువు ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. రావణ్ మావోయిస్టు భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాడని, సాయుధ విప్లవానికి మద్దతు ఇస్తున్నాడని జనసేన నేత ఒకరు చేసిన ఫిర్యాదు మేరకు జూలై నెలలో పోలీసులు రావణ్‌ను అరెస్టు చేసి ఉపా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తాజా ఉత్తర్వులతో దర్యాప్తు అధికారులు విచారణను కొనసాగించి, తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

బీసీ రిజర్వేషన్లు: టీడీపీ, వైసీపీలపై

## విజయసాయి రెడ్డి తీవ్ర విమర్శలు

**స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను రద్దు చేసిన హైకోర్టు**

**50 శాతం కోటా పరిమితిని దాటవద్దన్న సుప్రీం నిబంధనను గుర్తు చేసిన న్యాయస్థానం**

**బీసీలను టీడీపీ, వైసీపీ మోసం చేస్తున్నాయన్న విజయసాయి**



**అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలుగుదేశం, వైసీపీ నాటకాలాడుతున్నాయని, ఓట్ల కోసం బీసీలను మోసం చేస్తున్నాయని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించేలా ఉన్నాయని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోలను హైకోర్టు కొట్టివేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ తీర్పుపై విజయసాయి రెడ్డి స్పందిస్తూ... రెండు పార్టీలు ఇదే తరహా రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. "చట్టపరంగా నిలబడవని తెలిసి కూడా రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటేలా ప్రభుత్వం జీవోలు ఇవ్వడం, ఆ తర్వాత దానికి వ్యతిరేకంగా వెనువెంటనే కోర్టుల్లో కేసులు వేయించడం వీరికి పరిపాటిగా మారింది" అని ఆయన ఆరోపించారు. ఈ విధంగా బీసీలను మభ్యపెట్టి, కోర్టు తీర్పులు రాగానే ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు.

# ఎడిటర్ వాయిస్

## జగన్ పులివెందులకు బాబు, పవన్.. అందుకేనా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ సొంత ఇలాకా పులివెందుల అన్నది తెలిసిందే. ఆయన తండ్రి కాలం నుంచి అక్కడ రాజకీయ కోటను నిర్మించుకుని వరసబెట్టి ప్రతీ ఎన్నికల్లోనూ గెలుస్తూ వస్తున్నారు. అలాంటి పులివెందులకు ఇపుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలసికట్టుగా వస్తున్నారు. ఈ నెల 5న పులివెందులలో జరిగే అధికారిక కార్యక్రమాలలో వారు పాల్గొంటారు అని అంటున్నారు. దాంతో అక్టోబర్ 5న ఏపీ మొత్తం పులివెందుల వైపు చూసే అవకాశం ఉంది. అలా ఓవర్ టూ పులివెందులగా ఆ రోజు కొన్ని గంటల పాటు మీడియా మొత్తం ఫోకస్ చేయనుంది.

**రాజకీయంగా చర్చ :** నిజానికి అధికార పార్టీ పెద్దలు ఎక్కడికి అయినా వెళ్లవచ్చు. అయితే ప్రత్యేకించి కొన్ని ప్రాంతాలకు వెళ్ళినపుడు అక్కడ పొలిటికల్ వైబ్రేషన్స్ వేరేగా ఉంటాయి. అందుకే అంతటి చర్చకు ఆస్కారం ఏర్పడుతుంది. విషాయానికి వస్తే అక్టోబర్ 5వ తేదీన వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో బబు పవన్ పర్యటించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో బాబు పవన్ కలిసి పర్యటించనుండటం ఇదే మొదటిసారి కావడంతో ఈ విషయం రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే అధికారిక కార్యక్రమాల్లోనే వారు పాల్గొంటారు అని అంటున్నారు.

**అభివృద్ధికి శ్రీకారం :** ఇక పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం పార్నపల్లె సమీపంలో సుమారు 480 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన భారీ తాగునీటి ప్రాజెక్టు జల్ జీవన్ మిషన్ అమరజీవి జలధారని చంద్రబాబు పవన్ కలిసి ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా ఏడు మండలాల్లోని సుమారు 5.5 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందనుంది. అదే విధంగా పులివెందుల పరిధిలోని అర్హులైన పేద ప్రజలకు శాశ్వత ఇళ్ల పట్టాలను ఈ ఇద్దరు నేతలు పంపిణీ చేయనున్నారు. పులివెందుల నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు మౌలిక వసతుల పనులకు సైతం శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం ఈ పర్యటనలో భాగంగా కూటమి ప్రభుత్వం తరఫున ఒక భారీ బహిరంగ సభను కూడా నిర్వహించేందుకు అధికారులు స్థానిక కూటమి నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. మరి ఈ సభలో బాబు పవన్ ఏమి మాట్లాడుతారు అన్నదే ఉత్కంఠను రేపుతోంది.

**స్థానిక ఎమ్మెల్యేగా :** జగన్ మూడు సార్లు పులివెందుల నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. అలాగే ఒకసారి ముఖ్యమంత్రిగా రెండు సార్లు ప్రతిపక్ష నేతగా ఉన్నారు. గతంలో విపక్ష నేతగా అసెంబ్లీకి హాజరైన జగన్ ఈసారి మాత్రం అసలు వెళ్లడం లేదు, దాంతో స్థానిక ఎమ్మెల్యేగా జగన్ గురించి కూటమి పెద్దలు ఏమి మాట్లాడుతారు అన్నది కూడా చర్చగా ఉంది. అసెంబ్లీకి స్థానిక ఎమ్మెల్యే రావడం లేదన్న అంశం ప్రస్తావిస్తే కనుక అది రాజకీయంగా కాక పుట్టించే చాన్స్ ఉంది. నిజానికి ఎమ్మెల్యేగా పులివెందుల అభివృద్ధి విషయంలో జగన్ ఏమి చేశారు, కూటమి ప్రభుత్వం ఏమి చేసింది అన్నది కూడా ఈ ఇద్దరు నేతలు వివరించే చాన్స్ ఉంది. మొత్తానికి బాబు జగన్ కలిసి పులివెందుల రావడం అన్నది రాజకీయంగా చర్చకు తావు ఇస్తోంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు



జరగనున్న నేపథ్యంలో పులి వెందుల మున్సిపాలిటీ, అలాగే జెడ్పీటీసీలు ఎంపీపీలు కూడా గెలుచుకోవాలని కూటమి పక్కాగా టార్గెట్ చేస్తోంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## కావలిలో ఎస్సై అత్త దారుణ హత్య.. బంగారం చోరీ



**కావలి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒంటరిగా ఉంటున్న ఓ వృద్ధురాలిని దుండగులు దారుణంగా హతమార్చి ఆమె వద్ద ఉన్న బంగారం దోచుకెళ్లారు. ఆమె స్వయంగా నేరాల అదుపునకు కృషి చేసే ఎస్సైకి అత్త(భార్య తల్లి) కావడం కావలి పట్టణంలో దుమారం రేపింది. కావలి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. కావలి గ్రామీణ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న తిరుమలరెడ్డి అత్త పొంగులూరి విజయలక్ష్మి (68) అలియాస్ వీరమ్మ తుపాన్ నగర్ బైరాగులవీధి వద్ద ఒంటరిగా నివసిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న దుండగులు గురువారం ఆమె ఇంటిలోకి ప్రవేశించారు. ఆమె గొంతు నులిమి, ముఖంపై దిండు పెట్టి ఊపిరి ఆడకుండా చేసి హతమార్చారు. అనంతరం ఆమె మెడలో ఉన్న నగలు, గాజులు, చెవిదిద్దులతోపాటు బీరువాలో ఉన్న సుమారుగా 30 సవర్ల బంగారు నగలను అపహరించుకుపోయారు. ఈ సమాచారం తెలియగానే కావలి డీఎస్పీ వీవీ రమణకుమార్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. నిందితులు చేతికి గ్లౌజులు ధరించినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

## నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి.. వృద్ధుడికి జీవిత ఖైదు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి కేసులో వృద్ధుడికి జీవితఖైదు విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు ఇచ్చింది. గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న జి.నారాయణ(76) అదే ప్రాంతంలోని చిన్నారి(4)పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో 28 జూన్ 2025న గోల్కొండ పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు రూ.25వేలు జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

## గచ్చిబౌలిలో వ్యభిచార ముఠా గుట్టురట్టు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టురట్టయింది. ఓ హోటల్ కేంద్రంగా విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో హోటల్‌పై దాడి చేసి నిర్వాహకులు నిఖిల్, రామ్మోహన్‌రెడ్డి, విటుడు హర్షిత్ సింఘానియాతో పాటు ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.13వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిర్వాహకుడు నిఖిల్‌ను దిల్లీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఉజ్బెకిస్థాన్ నుంచి వచ్చిన మహిళల పాస్‌పోర్టులు, వీసాలు చెల్లుబాటులో ఉన్నట్లు నిర్ధరించారు. కొద్దిరోజుల క్రితమే వారు హైదరాబాద్‌కు వచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### అమెరికాకు వెళ్తుండగా

## ముగ్గురు భారతీయుల అపహరణ

**కిడ్నాపర్లు భారీ మొత్తం అడుగుతున్నారు**

**కుటుంబసభ్యుల ఆవేదన.. న్యాయం చేయాలని విజ్ఞప్తి**

**మెహ్‌సాణా, విశ్వం వాయిస్ న్యూస్ :** అక్రమ మార్గంలో అమెరికాకు వెళ్లేందుకు ప్రయత్నించిన గుజరాత్‌కు చెందిన ముగ్గురు భారతీయుల ఆచూకీ గల్లంతయింది. ఆ ముగ్గురు కిడ్నాప్ అయ్యారని.. వారిని విడిచిపెట్టేందుకు రూ. కోటి చెల్లించాలంటూ తమకు ఇథియోపియా నుంచి ఫోన్ కాల్ వచ్చిందని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు సహాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. గుజరాత్‌లోని మెహ్‌సాణా జిల్లాకు చెందిన మమతా చద్వా, రుత్విక్ జన్సారీ, మయూరీ సోలంకీ.. అక్రమమార్గాల్లో విదేశాలకు చేరవేసే నెట్‌వర్క్‌ను ఆశ్రయించారు. నెట్‌వర్క్‌లో భాగమైన అల్పేశ్ పంచల్, భార్గవ్ పటేల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒక్కొక్కరికి రూ.75 లక్షలు చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. మమత భర్త విద్యార్థి వీసాపై మూడేళ్లుగా అమెరికాలో ఉంటున్నారు. ఆయన దగ్గరకు వెళ్లేందుకు ఆమె గతంలో వీసాకు ప్రయత్నించినా తిరస్కరణే ఎదురైంది. సెప్టెంబరు 20న వీరు రాజస్థాన్‌కు వెళ్లి.. అక్కడి నుంచి అబుధాబీ వెళ్లేందుకు ఇతిహాద్ ఎయిర్‌వేస్ విమానం ఎక్కారు. అనంతరం ఇథియోపియా చేరుకున్నారు. నెలరోజుల కాలవ్యవధి ఉన్న వీసాపై ఆ దేశంలో బస చేశారు. సెప్టెంబరు 22 మమత స్వదేశంలోని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. కెనడా చేరుకున్నామని చెప్పింది. తర్వాత ముగ్గురి ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాయి. మూడు రోజుల తర్వాత కుటుంబ సభ్యులకు గుర్తుతెలియని వ్యక్తి నుంచి కాల్ వచ్చింది. ఆ ముగ్గురిని కిడ్నాప్ చేశామని, వారిని వదిలిపెట్టాలంటే కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అప్పటికే ఏజెంట్లకు లక్షల్లో చెల్లించిన ఆ కుటుంబం.. ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటోంది. ప్రభుత్వం జోక్యం చేసుకొని, తమవారిని కాపాడాలని మమత తండ్రి అభ్యర్థించారు. ఇప్పటికే తాము కిడ్నాపర్లకు రూ.60 లక్షలు ఇచ్చామని, వారు అదనంగా కోటి రూపాయలు డిమాండ్ చేస్తున్నారని అల్పేశ్ పంచల్ చెప్పాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# చాతుర్మాసం తర్వాత పెళ్లి ముహూర్తాలు ఇవే..



**నవంబర్, డిసెంబర్‌లో ఎన్ని రోజులో తెలుసా?**

**2026లో చాతుర్మాసం నవంబర్‌లో ముగియనుంది.** ఆ తర్వాత వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు ప్రారంభమవుతాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో పెళ్లికి అనుకూలమైన తేదీలు ఏవి? చాతుర్మాసంలో వివాహాలు ఎందుకు చేయరు? ఈ కాలానికి ఉన్న ధార్మిక ప్రాధాన్యత ఏమిటో తెలుసుకోండి.

హిందూ ధర్మంలో చాతుర్మాసం, మాసం, భార్మాసం పంటి కాలాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా చాతుర్మాస కాలంలో వివాహాలు, గృహప్రవేశాలు పంటి శుభకార్యాలను నిర్వహించకూడదనే ఆచారం చాలాకాలంగా కొనసాగుతోంది. ఈ సమయంలో భక్తులు జపం, తపస్సు, ధ్యానం, ఉపవాసం, పూజ పంటి ఆధ్యాత్మిక కార్యకమాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. సాధారణంగా చాతుర్మాసం ప్రారంభమైన తర్వాత వివాహాది శుభకార్యాలకు విరామం ఉంటుంది. దీంతో ఏడాది పొడవునా వివాహం చేసుకోవాలని ఎదురుచూసే కుటుంబాలు. చాతుర్మాసం ముగిసిన తర్వాత వచ్చే శుభ ముహూర్తాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటాయి. ముఖ్యంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయి. 2026లో చాతుర్మాసం ఎప్పుడు ముగుస్తుంది? నవంబర్, డిసెంబర్ నెలల్లో వివాహాలకు ఎన్ని శుభ తేదీలు ఉన్నాయి? తెలుసుకుందాం.

### చాతుర్మాసం 2026 ఎప్పుడు ముగుస్తుంది?

2026లో చాతుర్మాసం జూలై 25 నుంచి నవంబర్ 21 వరకు కొనసాగుతుంది. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటారని హిందూ ధర్మ విశ్వాసం. అందువల్ల వివాహాలు, గృహప్రవేశాలు పంటి ముఖ్యమైన శుభకార్యాలను సాధారణంగా నిర్వహించరు. చాతుర్మాస కాలం సుమారు నాలుగు నెలల పాటు కొనసాగుతుంది. ఇందిలో శ్రావణం, భాద్రపదం, అశ్వయుజం, కార్తీకం మాసాలు వస్తాయి. ఈ కాలాన్ని భక్తి, నియమాలు, ఉపవాసాలు, పూజలు, ధ్యానం పంటి ఆధ్యాత్మిక సాధనలకు అనుకూలమైనదిగా భావిస్తారు.



కార్తీక మాసంలో వచ్చే దేవత్థాన ఏకాదశితో చాతుర్మాసం ముగుస్తుందని ధార్మిక సంప్రదాయాలు చెబుతున్నాయి. ఈ రోజున శ్రీమహావిష్ణువు యోగనిద్ర నుంచి మేల్కొంటారని విశ్వసిస్తారు. అనంతరం వివాహాలు, ఇతర శుభకార్యాలకు మళ్లీ శ్రీకారం చుడతారు. ఇదే సమయంలో తులసి వివాహం నిర్వహించే సంప్రదాయం కూడా ఉంది.



### చాతుర్మాసంలో వివాహాలు ఎందుకు నిర్వహించరు?

శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో యోగనిద్రలోకి వెళతారు. ఆయన యోగనిద్రలో ఉండే నాలుగు నెలల కాలాన్నే చాతుర్మాసంగా భావిస్తారు. ఈ సమయంలో వివాహాలు, గృహప్రవేశాలు పంటి శుభకార్యాలను నిర్వహించదం సంప్రదాయబద్ధంగా నివారిస్తారు. ఈ కాలాన్ని సంయమనం, ఉపవాసం, పూజ, జపం, ధ్యానం, ఆధ్యాత్మిక చింతనకు కేటాయించాలనే భావన ఉంది.

### నవంబర్ 2026లో వివాహ ముహూర్తాలు

చాతుర్మాసం ముగిసిన తర్వాత నవంబర్‌లో వివాహలకు నాలుగు శుభ తేదీలు ఉన్నట్లు వెర్కొనబడింది.

| తేది | వారం | ముహూర్తం / నక్షత్రం |
|---|---|---|
| నవంబర్ 21, 2026 | శనివారం | ఉదయం 06:44 – మధ్యాహ్నం 12:08 (రేవతి నక్షత్రం) |
| నవంబర్ 24, 2026 | మంగళవారం | రాత్రి 11:25 – నవంబర్ 25 ఉదయం 06:47 (రోహిణి నక్షత్రం) |
| నవంబర్ 25, 2026 | బుధవారం | నవంబర్ 26 ఉదయం 06:47 – 06:48 |
| నవంబర్ 26, 2026 | గురువారం | ఉదయం 06:48 – సాయంత్రం 05:47 |

శుభ ముహూర్తాల్లో శుభకార్యాలు సాఫల్యం కలుగాలి...!

### డిసెంబర్ 2026లో వివాహ ముహూర్తాలు

డిసెంబర్‌లో వివాహలకు ఏడు శుభ తేదీలు ఉన్నట్లు పేర్కొనబడింది.

| తేది | వారం | తిథి/ నక్షత్రం |
|---|---|---|
| డిసెంబర్ 2, 2026 | బుధవారం | నవమి, దశమి తిథులు |
| డిసెంబర్ 3, 2026 | గురువారం | ఉత్తర పాల్గుణి / హస్త నక్షత్రం |
| డిసెంబర్ 4, 2026 | శుక్రవారం | ఏకాదశి తిథి |
| డిసెంబర్ 5, 2026 | శనివారం | ద్వాదశి, త్రయోదశి తిథులు |
| డిసెంబర్ 6, 2026 | ఆదివారం | త్రయోదశి తిథి |
| డిసెంబర్ 11, 2026 | శుక్రవారం | తృతీయ తిథి |
| డిసెంబర్ 12, 2026 | శనివారం | తృతీయ, చతుర్థ తిథులు |

సాంప్రదాయాన్ని పాటిద్దాం... శుభకార్యాలను సంతోషంగా జరుపుకుందాం...

# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు

శుక్రవారం, 02 అక్టోబర్, 2026








www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత

www.viswamvoice.com


# దేవి చౌక్ అమ్మవారి పంచాయతీ ఎమ్మెల్యే దృష్టికి..

**• అమ్మవారి సేవలో రాజకీయమా..? • కంబాలపై కక్ష సాధింపుల ఆరోపణలు**

**• దసరా మహోత్సవాల వేళ తెరపైకి వివాదం.. అందరూ కలిసి ఉత్సవాలను విజయవంతం చేయాలని వరసాల ప్రసాద్ పిలుపు**





**గోకవరం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరంలో సుమారు 25 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు జరుగుతున్న వేళ ఆలయ సేవా కార్యక్రమాల విషయంలో వివాదం తెరపైకి వచ్చింది. అమ్మవారి సేవకుడు, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావుపై కొందరు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారంటూ అమ్మవారి భక్తుడు వరసాల ప్రసాద్ ఆరోపించారు. ఇదే విషయంపై గత మూడు రోజులుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి వెళ్లిందంటూ ఆరోపణలు కూడా గట్టిగానే వినిపిస్తున్నాయి. గత నాలుగు సంవత్సరాలుగా కంబాల శ్రీనివాసరావు అమ్మవారి ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో తనవంతు సహకారం అందిస్తూ వస్తున్నారని ప్రసాద్ తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులతో పాటు విజయదశమి అనంతరం అమ్మవారి ఊరేగింపునకు ఉపయోగపడేలా సుమారు రూ.50 లక్షల వ్యయంతో రథాన్ని తయారు చేయించి అమ్మవారికి సమర్పించారని పేర్కొన్నారు. ఇటీవల కూడా గోకవరం డ్రైవర్స్ కాలనీలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని కంబాల ప్రకటించినట్లు స్థానిక మీడియా కథనం వెల్లడించింది. ప్రతి సంవత్సరం విజయదశమి సందర్భంగా కంబాల శ్రీనివాసరావు దంపతులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించేవారని వరసాల ప్రసాద్ పేర్కొన్నారు. అయితే ఈ ఏడాది పూజల విషయంలో మార్పులు చేయడం వెనుక కక్ష సాధింపు ధోరణి ఉందని ఆయన ఆరోపించారు. ఆలయ సేవా కార్యక్రమాల్లో రాజకీయాలకు తావివ్వకుండా భక్తులందరినీ సమానంగా చూడాలని కోరారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న వారిని చిన్నచూపు చూడటం సరికాదని, వ్యక్తిగత విభేదాలను అమ్మవారి ఉత్సవాలకు దూరంగా ఉంచాలని వరసాల ప్రసాద్ అన్నారు. కంబాల శ్రీనివాసరావు అనేక సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు అండగా నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం కాకముందే ఆలయ వ్యవహారాల్లో రాజకీయ వాతావరణం నెలకొనడం భక్తుల్లో చర్చనీయాంశంగా మారిందని ప్రసాద్ అన్నారు. దసరా మహోత్సవాలు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు అమ్మవారి సేవకులు, కమిటీ సభ్యులు, భక్తులందరూ ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అమ్మవారి సేవలో విభేదాలకు చోటు లేకుండా.. అందరూ ఒక్కటై దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలన్నదే భక్తుల ఆకాంక్షగా ఆయన పేర్కొన్నారు.

గర్భిణీ స్త్రీలు, బాలింతలు

# ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**పసలపూడిలో ఘనంగా పోషణ మాసోత్సవాలు**

**గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన - సామూహిక శ్రీమంతాలు, ఆశీర్వాదాలు**



**రాయవరం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం మండలం పసలపూడి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. సిడిపిఓ యు. పూర్ణిమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భధారణ సమయంలో పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా తల్లితో పాటు శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ఆకుకూరలు, తాజా పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. సరైన ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని వివరించారు. చిన్నారులకు నిర్ణీత వయస్సు నుంచి పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పోషకాహారంపై ప్రతి కుటుంబంలో అవగాహన పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయవచ్చని వివరించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించి, వారిని ఆశీర్వదించి, అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి రామచంద్రపురం నీటిపారుదల సంఘం అధ్యక్షులు వెలగల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తి వెంకట కృష్ణారెడ్డి, రాయవరం మండల తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ నల్లమల్లి సతీష్ రెడ్డి, మాచవరం సెక్టార్ సూపర్వైజర్ వాసంశెట్టి విష్ణుకుమారి, ఏఎన్ఎం డి. సద్గుణ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**కాకినాడ, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కత్తిపూడి సీతారామ జూనియర్ కళాశాలలో జరిగిన "పేదల సేవలో 2.0" కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ ఇతర ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకులు సమన్వయంతో పనిచేస్తేనే సంక్షేమ ఫలాలు అట్టడుగు వర్గాలకు సంపూర్ణంగా అందుతాయని ఉద్ఘాటించారు. ప్రజల ఇంటి ముంగిటకే మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ప్రతి అర్హులైన లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ఈ పేదల సేవలో 2.0 కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ 6 పథకాలు, పింఛన్ల పంపిణీ తీరు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి మేలు జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజల సంతృప్తే పరమావధి గా రాబోయే పదిహేను నెలల కాలంలో ప్రతి స్వర్ణ గ్రామం పరిధిలో ఈ సేవలను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారుల నిర్మాణం, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గతంలోనూ, తాజాగా రూ. 11 వేల కోట్ల భారీ నిధులతో మూడవ విడత కింద రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారని ఆమె పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజక వర్గంలో కూడా ఈ నిధులతో సిసి రోడ్లు, బీటీ రోడ్లు, గోశాలల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నట్లు ఆమె వివరించారు. యువత, మహిళలు కేవలం ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా, స్వయం ఉపాధి ద్వారా నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆమె పిలుపు నిచ్చారు.మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తరఫున అవసరమైన శిక్షణ, బ్యాంక్ రుణాల ద్వారా పూర్తి సహాయం అందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, కోళ్ల పెంపకం వంటి రంగాలలో రాణిస్తూ తోటివారికి ఉపాధి కల్పిస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న ఈ భరోసాని అందరూ సద్వినియోగం చేసుకుని మరింత ముందుకు రావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ.శ్రీనివాసరావు ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు రాయవరం విద్యార్థిని



**రాయవరం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల్లో సృజనాత్మకత, సామాజిక బాధ్యత, దేశాభివృద్ధిపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన సేవా సంకల్ప్ అభియాన్ (వికసిత్ భారత్ ఏ2047) జిల్లా స్థాయి పోటీల్లో రాయవరం శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని నల్లమిల్లి స్నిగ్ధ శ్రీ అనేహారెడ్డి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఎస్కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో కేటగిరీ-2 విభాగంలో పాల్గొన్న ఆమె తృతీయ బహుమతిని కైవసం చేసుకుని మెరిట్ సర్టిఫికెట్, పతకాన్ని అందుకున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో విద్యార్థిని సాధించిన విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, గ్రామస్థులు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభను చాటి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సీతానగరం అంగన్‌వాడీ కేంద్రంలో తీవ్ర కలకలం

**అధికారుల చర్యల వేళ ఎమ్మెల్యే వద్ద విలేకరులపై బురదజల్లే యత్నం!**



**సీతానగరం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో అంగన్వాడీ కార్యకర్తల వ్యవహారం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మండల పరిధిలోని సీతానగరం-4 అంగన్వాడీ కేంద్రంలో చిన్నపిల్లలను గదిలో పెట్టి బయట నుంచి తాళం వేసిన ఘటన సంచలనంగా మారింది. ఈ నిర్లక్ష్యపూరితమైన ఘటనపై జిల్లా కలెక్టర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**కలెక్టర్ ఆదేశాలతో కలవరం - విధులకు బహిష్కరణ**

కలెక్టర్ చర్యలకు ఆదేశించడంతో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తల్లో తీవ్ర కలవరం మొదలైంది. ఈ నేపథ్యంలో సీతానగరం-1, ముగ్గుళ్ళ అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు కలెక్టరు చర్యలకు నిరసనగా తమ విధులను బహిష్కరించారు.

**ఎమ్మెల్యే, టీడీపీ నేతలను కలసిన అంగన్వాడీలు**

సీతానగరం పర్యటనలో ఉన్న రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరిలను విధులను బహిష్కరించి. అంగన్వాడీ కార్యకర్తలు కలిశారు. కలెక్టర్ తమపై చేపట్టిన క్రమశిక్షణ చర్యలను నిలిపివేసేలా చొరవ చూపాలని వారు ప్రజాప్రతినిధులను వేడుకున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, నేత బొడ్డు వెంకటరమణ చౌదరి వెంటనే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి, అంగన్వాడీ కార్యకర్తలపై చర్యలను నిలిపివేయాలని సిఫార్సు చేశారు.

**విలేకరులపై బురదజల్లే యత్నం**

అయితే, తాము చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు అంగన్వాడీలు ప్రజాప్రతినిధుల వద్ద కొత్త నాటకానికి తెరతీశారు. చిన్నపిల్లలను గదిలో వేసి తాళం వేసిన ఘటనపై వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన విలేకరులపైనే వారు బురదజల్లే ప్రయత్నం చేశారు. విలేకరులు తమను డబ్బులు అడిగారని, ఇవ్వనందుకే వార్తలు రాశారని ఎమ్మెల్యే వద్ద తప్పుడు ప్రచారం చేస్తూ వారి ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరించడంపై స్థానికంగా మరియు విలేకరుల వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.




విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
శుక్రవారం, 02 అక్టోబర్ 2026
www.viswamvoice.com


# నిరుద్యోగం రూపుమాపే వరకు నిరంతరం జాబ్ మేళాలు

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
### ఐటీ రంగంలోని నిరుద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

**రామచంద్రపురం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజవర్గంలో నిరుద్యోగ సమస్య నిర్మూలననే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు సమన్వయంతో రామచంద్రపురంలోని వీఎస్ఎం కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విశేష విజయాన్ని సాధించింది. ఈ జాబ్ మేళాకు దేశంలోని ప్రముఖ 25 మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా, మొత్తం 245 మంది యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రామచంద్రపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు 52 జాబ్ మేళాలను విజయవంతంగా నిర్వహించామని, ఈ జాబ్ మేళాల ద్వారా వేలాదిమంది నిరుద్యోగ యువత ఉపాధి పొందారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువత నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఐటీ రంగంలో ఉద్యోగాలు కోరుకునే నిరుద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ తదితర ఆధునిక కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ శిక్షణ పొందేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు మంత్రి క్యాంపు కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల ద్వారా నాలుగు లక్షల నుంచి ఏడు లక్షల రూపాయల వార్షిక వేతన ప్యాకేజీలతో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొంటూ యువత తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకుని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య పూర్తిగా అంతరించిపోయే వరకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళాలను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని ఫౌండేషన్ చైర్మన్, కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తెలిపారు. మెగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఆయన చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆలోచనలకు అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.



ఇప్పటివరకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా అనేక మంది యువత తమ జీవితాల్లో స్థిరపడగలిగారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రముఖ కంపెనీలను తీసుకువచ్చి జాబ్ మేళాలను విజయవంతం చేస్తున్న వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు సేవలను వాసంశెట్టి సత్యం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సంస్థలను భాగస్వామ్యం చేసి యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావు మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలన కోసం మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరిన్ని జాబ్ మేళాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఉద్యోగ అవకాశాలు పొందిన అభ్యర్థులు మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. లచ్చారావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ వి. రవీంద్ర, వికాస మేనేజర్లు శర్మ, శ్రీకాంత్, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, ఎస్‌కేపీపీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, కట్టా నాగేశ్వరరావు, బళ్ల శివ, పొనకల చంటి తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,
# కోనసీమ ముద్దుబిడ్డ జీఎంసీ బాలయోగి

### 75వ జయంతి వేడుకలలో మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం రూరల్, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కోనసీమ ముద్దుబిడ్డ జీఎంసీ బాలయోగి గారు అని, భారత పార్లమెంటరీ వ్యవస్థలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు, లోక్‌సభ మాజీ స్పీకర్ స్వర్గీయ గంటి మోహనచంద్ర బాలయోగి అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. జీఎంసీ బాలయోగి 75 వ జయంతి సందర్భంగా వెలం పాలెంలో బాలయోగి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఒక సామాన్య దళిత రైతు కుటుంబంలో జన్మించిన బాలయోగి, తన నిష్పక్షపాత వైఖరి, హుందాతనంతో దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ పదవులలో ఒకటైన లోక్‌సభ స్పీకర్ పదవిని అధిరోహించారన్నారు. లోక్‌సభ సభాపతిగా క్లిష్ట పరిస్థితుల్లోనూ సభను సమర్థవంతంగా నడిపి, పార్లమెంటరీ సంప్రదాయాలను బలోపేతం చేశారని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, వారి విద్యా, సామాజిక వికాసానికి బాలయోగి గారు ఎనలేని కృషి చేశారని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా (కోనసీమ) అభివృద్ధికి, రైల్వే లైన్ల మంజూరుకు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయిని, అతి పిన్న వయస్సులోనే లోక్‌సభ స్పీకర్ బాధ్యతలు చేపట్టి, జాతీయ రాజకీయాల్లో తెలుగువారి కీర్తిని దశదిశలా చాటిన మహోన్నత వ్యక్తి అయిన బాలయోగి మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, రాజకీయ విలువలు నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన మాజీ కార్పొరేటర్ ఎ.వి.రమణ

### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ కార్పొరేటర్, టి.నగర్ విశ్వేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఎ.వి. రమణ భారతీయ జనతా పార్టీలో చేరారు. బుధవారం రాజమహేంద్రవరం టి.నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సోము వీర్రాజు మాట్లాడుతూ ఎ.వి. రమణ గతంలో కార్పొరేటర్‌గా, జోడు గుళ్ల దేవస్థానం చైర్మన్‌గా పనిచేస్తూ ప్రజలకు, ఆలయ అభివృద్ధికి సేవలందించారని పేర్కొన్నారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ పనిచేసిన నాయకుడు బీజేపీలో చేరడం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని అన్నారు. బీజేపీ సిద్ధాంతాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై విశ్వాసంతో మరికొందరు నాయకులు కూడా పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరిస్తోందని సోము వీర్రాజు అన్నారు. రాష్ట్రంలో మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించారు. పార్టీలో చేరిన ఎ.వి. రమణ మాట్లాడుతూ తాను ఎలాంటి పదవుల ఆశతో బీజేపీలో చేరలేదని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి అందిస్తున్న సేవలు, ఆయన నాయకత్వం తనను ఆకర్షించాయని తెలిపారు. మోదీ స్ఫూర్తితో ప్రజాసేవలో నీతి, నిజాయితీకి ప్రాధాన్యం ఇస్తూ బీజేపీలో తన వంతు సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, రాష్ట్ర నాయకులు కురగంటి సతీష్, రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణ, కాలెపు సత్య సాయిరామ్, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, బూర రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు తునుబుద్ది సూర్యభాస్కర్, కందికొండ రమేష్, అలివేలు, సాయి తదితరులు ఎ.వి. రమణకు అభినందనలు తెలిపారు.

# లక్ష్మీపాలెంలో ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవ్



**రావులపాలెం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం పరిధిలోని పొడగట్లపల్లి లక్ష్మీపాలెం అంగన్వాడీ కేంద్రంలో సీడిపిఓఎ గజలక్ష్మి ఆదేశాలు మేరకు సూపర్ వైజర్ జహంగీర్ సుల్తానా బేగం పర్యవేక్షణలో కార్యకర్త సంకు శ్రీలక్ష్మి అంగన్వాడీ ఉత్సవ్ ఘనంగా నిర్వహించారు.గురువారం అంగన్వాడీలో మోడీ సేవ సంకల్ప్ అభియాన్ లో భాగంగా అంగన్వాడీ ఉత్సవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాలల భవిష్యత్తుకు బలమైన పునాది అంగన్వాడీ కేంద్రాలే సమాజానికి తొలి విద్యా వేదికలన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో కేంద్రంలోను రాష్టంలోను ఎన్డీయే ప్రభుత్వం అందిస్తున్న మహత్తర పాలనే అందుకు నిదర్శనమన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కలయికతో కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సంక్షేమానికి అభివృద్ధికి బాటలు వేసారన్నారు. చిన్నారుల్లో విద్య, ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతపై అవగాహన పెంపొందిస్తూ, వారి సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రం చేస్తున్న సేవలు ఎంతో విలువైనవి అన్నారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య,గర్భిణీ బాలింతలు ఆరోగ్యాభివృద్ధి కి కృషి చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది సేవలను కొనియాడారు.అనంతరం గ్రామ పెద్దలు,తల్లులు అంగన్వాడీ కార్యకర్తను,హెల్పర్ ను దుస్సాలువా తో ఘనంగా సన్మానించారు. అలాగే అంగన్వాడీ కార్యకర్త తల్లులను దుస్సాలువా ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, అంగన్వాడీ హెల్పర్ రేవతి నాగస్వాతి, గర్భిణీ, బాలింతలు తల్లులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# వృద్ధులు ఆస్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

### రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద




**రామచంద్రపురం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** వృద్ధాప్యంలో వృద్ధులు తమ ఆస్తులను సంతానానికి పూర్తి హక్కులతో రాసి ఇచ్చి, ఆ తర్వాత కష్టాలపాలై రక్తసంబంధాలకు దూరం కావద్దని రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద హితవు పలికారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో మండల లోక్ అదాలత్ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 చట్టం ప్రకారం పలు కీలక అంశాలను వివరించారు. పిల్లలకు ఆస్తులను బదలాయించేటప్పుడు కొంత ఆస్తిని తమ వద్దే ఉంచుకోవాలని, మిగతాది మాత్రమే పిల్లలకు రాయాలని సూచించారు. ఒకవేళ పిల్లలు సరిగ్గా చూసుకోని పక్షంలో ఆస్తులను వెనక్కి తీసుకునే విధంగా తగిన నిబంధనలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు. అలాగే వీలునామా రాసేటప్పుడు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తన జీవితకాలంలో ఎప్పుడైనా వీలునామా మార్చుకునే హక్కు తనకు ఉంటుందని, వృద్ధాప్యంలో యోగక్షేమాలు చూడకపోతే ఆస్తి సంక్రమించదనే షరతులు స్పష్టంగా పొందుపరచాలని తెలిపారు. సీనియర్ సిటిజన్ చట్టం కింద 60 సంవత్సరాలు దాటిన వారికి ఉచిత బస్సు ప్రయాణం, రైల్వే ప్రయాణాల్లో రాయితీలు లభిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు పి.రామకృష్ణ, ప్యానల్ న్యాయవాదులు దొమ్మలపాటి సత్యనారాయణ, నందిక కళ్యాణి, లోక్ అదాలత్ సిబ్బంది సుభాషిని, పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

### రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
# స్పోకెన్ హిందీ సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభం



**రామచంద్రపురం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల కోసం ఒక నెల రోజుల పాటు నిర్వహించే 'స్పోకెన్ హిందీ' సర్టిఫికెట్ కోర్సు ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కే.చిట్టిబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో, మాతృభాషతో పాటు ఇతర భాషల్లోనూ ప్రావీణ్యత సాధించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా, ఎక్కడ ఉద్యోగం చేసినా భాషా పరమైన ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండటానికి హిందీ అధ్యయనం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులందరూ ఆంగ్ల మరియు హిందీ భాషల్లో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. హిందీ విభాగాధిపతి ఎన్వి రమణ ఆధ్వర్యంలో ఈ కోర్సును ప్రారంభించారు. రోజూ ఒక గంట పాటు తెలుగు మాధ్యమం ద్వారా విద్యార్థులకు సులువుగా హిందీ మాట్లాడటం నేర్పించనున్నారు. కేవలం పాఠ్యాంశాల చదువు మాత్రమే కాకుండా, ఇలాంటి అదనపు సర్టిఫికెట్ కోర్సుల్లో చేరడం ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో ఆంగ్ల విభాగాధిపతి పంకజ్, తెలుగు విభాగానికి చెందిన ఎన్.సుజాత, లావణ్యలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 3, 4 తేదీల్లో ఐఎఫ్‌టియు 9వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని పిలుపు

**ద్రాక్షారామ, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) 9వ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 3, 4 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి బి. సిద్ధు తెలిపారు. గురువారం ద్రాక్షారామ మార్కెట్ యార్డులో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ, కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. ఈ మహాసభల్లో ఐఎఫ్‌టియు జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ గాయల్, మార్క్సిస్టు విశ్లేషకులు రమేష్ పట్నాయక్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిట్టిబాబు తదితరులు “నాలుగు లేబర్ కోడ్స్ - రాజ్యాంగ హక్కులు” అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 29 చట్టాలతో కూడిన నాలుగు లేబర్ కోడ్స్‌గా




మార్చడం ద్వారా కార్మికుల హక్కులను బలహీనపరుస్తున్నారని బి. సిద్ధు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు, పెరుగుతున్న ధరలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిస్తూ, జిల్లాలోని కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు చింతా రాజారెడ్డి, ఎస్.కె. కమల్ భాషా, డప్పు కళాకారుల అధ్యక్షుడు పలివెల వీర వెంకట సత్యనారాయణ, రావి నాగరాజు, మడికి ఏగేశ్వరరావు, గుబ్బల శ్రీను, మడికి దుర్గాప్రసాద్, కటకం రాజు, మందపల్లి దోసాలు, జి. చిన్నకొండ, పెయ్యల సూరిబాబు, గురజా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### యువత రక్తదానాన్ని

# ఒక బాధ్యతగా అలవాటు చేసుకోవాలి

**అత్యవసర చికిత్స పొందే రోగులు రక్తం కోసం ఎదురు చూస్తుంటారు**
**యువతీ యువకులు పౌష్టికాహారం తీసుకుంటూ రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్త పడాలి**
**యువకులు మద్యపానం, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్**




**కాకినాడ, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజంలో ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆదుకోవడం లో రక్తదానం అత్యంత కీలకమని ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని ఒక బాధ్యతగా అలవాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్నిపురస్కరించుకుని స్థానిక పీ.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ, రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వై.డి.రామారావు, హెచ్.డి.ఎఫ్.సి. మేనేజర్ అనంత కుమార్, తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేస్తున్న విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ అవయవదానాలు ఎంతటి గొప్పవో రక్తదానం కూడా అంతే ప్రాముఖ్యత కలిగి ఉందని అభివర్ణించారు. జాతీయ స్థాయిలో విశేష సేవలు అందిస్తున్న రెడ్ క్రాస్ సంస్థ మన కాకినాడ శాఖ ద్వారా అద్భుతమైన సేవలను అందిస్తోందని కలెక్టర్ కొనియాడారు. నిత్యం ఎన్నో పేద కుటుంబాలు,అత్యవసర చికిత్స పొందే రోగులు రక్తం కోసంఎదురుచూస్తుంటారని అలాంటి వారి అవసరాలను తీర్చడంలో రెడ్ క్రాస్ పాత్ర ప్రశంస నీయమని జిల్లా కలెక్టర్ కొని యాడారు. ఉత్తమ సేవలందిస్తున్న కాకినాడ చాప్టర్‌కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించడం మనందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. యువత తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. యువత రక్తదానాన్ని ఒక బాధ్యతగా అలవాటు చేసు కోవాలన్నారు. ముఖ్యంగా యువతి, యువకులు పౌష్టికాహారం తీసుకుంటూ రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్త పడాలని జంక్ ఫుడ్ అలవాట్లను పూర్తిగా మానుకోవాలని హితవు పలికారు. అలాగే యువకులు మత్తు పదార్థాలు, మద్యపానం, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. మత్తుకు అలవాటు పడటం వల్ల ప్రమాదాల సంభవించే అవకాశం ఉందని ఆ సమయం లో ప్రాణాలను కాపాడటం కష్టమవుతుందని, రక్తం దానం చేసే అవకాశం కూడా కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి మూడు నెలలకోసారి ఆరోగ్యవంతమైన వ్యక్తులు క్రమం తప్పకుండా రక్తదానం చేయవచ్చని, దీనివల్ల ఎంతో మంది నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించేందుకు బాటలు వేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా గుణం అలవర్చుకుని రెడ్ క్రాస్ వాలంటీర్లు గా స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ.రామారావు మాట్లాడుతూ రక్తదాన ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడాలని పిలుపు నిచ్చారు.ప్రపంచ వ్యాప్తంగా బ్లడ్ బ్యాంకింగ్ నిర్వహిస్తున్న ఏకైక మానవతా స్వచ్ఛంద సంస్థ రెడ్ క్రాస్ అని, మన రాష్ట్రంలో 20 బ్లడ్ బ్యాంకుల ద్వారా ప్రతిఏటా లక్ష యూనిట్ల రక్తాన్ని ప్రజలకు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పరిధిలో తలసీమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు ప్రతి మంగళవారం ఉచితంగా రక్తాన్ని మార్పిడి చేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రక్తం కొనుగోలు చేసే పద్ధతి నుంచి స్వచ్ఛందగా రక్తదాన సంస్కృతికి మళ్లాలన్నారు. బ్లడ్ ట్రాన్స్ఫ్యూషన్ పితామహుడు జైగోపాల్ జాలీ జయంతి సందర్భంగా అక్టోబర్ 1వ తేదీని జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఆయన వివరించారు. యువత చదువుతో పాటు సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు బాధ్యయుతమైన పౌరులుగా ఎదగాలని, దేశాభివృద్ధికి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఇలాంటి సామాజిక కార్యక్రమాలలో అధిక సంఖ్యలో పాల్గొని తమ వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. హెచ్‌డిఎఫ్‌సి మేనేజర్ అనంత కుమార్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగం సామాజిక బాధ్యతలో భాగంగా ఇప్పటివరకు సుమారు ఆరు లక్షల యూనిట్ల రక్తనాన్ని సేకరించామన్నారు. రక్తదానం పట్ల కొందరిలో ఉన్న అపోహలను తొలగిస్తూ, తాము కూడా ప్రతి ఏటా రక్తదానం చేస్తున్నామని ప్రతి ఒక్కరూ ఫిట్‌గా ఉంటూ తోటివారి ప్రాణాలను కాపాడటంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.వీకే. మెహర్, బ్లడ్ డొనేషన్ క్యాంపు కన్వీనర్ డా.పి.కిరణ్ కుమార్, అధ్యాపకులు ఆంజనేయులు, సామ్యేల్, కళాశాల ఎన్ఎస్-ఎస్, ఎన్సిసి అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధికి

# బాలయోగి చేసిన కృషి ఆదర్శనీయం

**కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**



**కాకినాడ, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధికి మాజీ లోక్‌సభ స్పీకర్ దివంగత జీఎంసీ బాలయోగి చేసిన కృషి ఎప్పటికీ ఆదర్శనీయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు (వెంకటేశ్వరరావు) కొనియాడారు. గురువారం కాకినాడ జగన్నాథపురం యానం రోడ్డులోని బాలయోగి విగ్రహం వద్ద ఆయన 75వ జయంతి వేడుకలను ఘనంగా గురువారం నిర్వహించారు. బొడ్డు దేవరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు, బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ బాలయోగి ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించారని గుర్తుచేశారు. ముఖ్యంగా కోనసీమతో పాటు మారుమూల ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, తాగునీటి సదుపాయాలు వంటి శాశ్వత మౌలిక వసతుల కల్పనలో ఆయన చూపిన చొరవ చిరస్మరణీయ మన్నారు. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేసిన ఆయన నాయకత్వ లక్షణాలు, నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బాలయోగి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా ఒక పార్టీ కార్యకర్తకు ఎమ్మెల్యే కొండబాబు చేతుల మీదుగా సైకిల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంబటి చిన్న, సబ్బతి ఫణీశ్వరరావు, జి.సత్తిబాబు, జక్కయ్య అప్పన్న, గరికిన పెద్దరాజు, జామి సత్తిరాజు, పెమ్మాడి శ్రీను, పాయసం గోపాలకృష్ణ, ఓలేటి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్హతే ప్రామాణికంగా ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు

**ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే యనమల దివ్య**
**ఎన్ఎస్ వెంకటనగరంలో ప్రజా దర్బార్‌కు విశేష స్పందన**



**కోటనందూరు, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేదకు అందించి వారి ఆర్థిక అవసరాలను తీర్చడంతో ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అన్నారు.మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి అధ్యక్షతన తుని మండలం ఎన్ ఎస్ వెంకటనగరంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సీనియర్ నేత యనమల రాజేష్‌తో కలిసి ప్రభుత్వ విఫ్ యనమల దివ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు.తొలుత ఎన్టీఆర్ భరోసా లబ్దిదారుల ఇంటికి వెళ్ళి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే యనమల దివ్య పెన్షన్ సొమ్ము అందజేసారు. ఎలాంటి వివక్షత చూపకుండా కొత్త పెన్షన్లకు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను అధికారులు పారదర్శకంగా చేస్తున్నారని అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత కొత్త పెన్షన్లు అందజేస్తామన్నారు. అదేవిధంగా రైతు అవసరాలకు నిర్మించిన గోశాల షెడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే మరికొంత మంది రైతులకు రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలను పంపిణి చేశారు.

**ఎన్ఎస్ వెంకటనగరంలో ప్రజాదర్బార్‌కు విశేష స్పందన**

తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో వర్మ, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎన్ ఎస్ వెంకటనగరంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కు విశేష స్పందన లభించింది ప్రజాదర్బార్ కు వచ్చిన ప్రజల కష్టసుఖాలు అడిగి తెలుసుకున్న ఆమె వారి సమస్యలను సావధానంగా విన్నారు. అర్జీలను స్వీకరించిన ఆమె వాటిని పరిశీలించి చాలా వరకూ అక్కడికక్కడే పరిష్కారించారు. ప్రధాన సమస్యలకు సంబంధించిన అర్జీలను పరిష్కార నిమిత్తం అధికారులకు అందజేసిన దివ్య ప్రజలకు జవాబుదారీ తనం తో సంతృప్తికరమైన సేవలను అందించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

### వయోవృద్ధుల సంక్షేమానికి

# రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది

**ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ**



**కాకినాడ, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు హిజ్రా వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డులోని సత్య కళావాహినిలో గురువారం సాయంత్రం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వృద్ధులకు ఆసరా ఇవ్వాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. వారి నుండి ఎన్నో జీవిత సత్యాలను తెలుసుకుని ఆచరణలో పెడితే కష్టాలనుఅధిగమించ వచ్చని అన్నారు. క్రమశిక్షణతో ఎంతటి బాధ్యతలైనా సులువుగా నిర్వహించ వచ్చునని ఇందుకు ప్రత్యక్ష తార్కాణం ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలుస్తారని అన్నారు. ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. వికలాంగ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏవై శ్రీనివాస్ మాట్లాడుతూ శాఖాపరమైన నివేదిక వెల్లడించారు. ఈ సంవత్సరం సుదీర్ఘ జీవితాల కోసం వ్యవస్థలనుపునరాలోచించడం థీమ్ గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 12.25 శాతం వయోవృద్ధులు ఉన్నారని అన్నారు.60సంవత్సరాలు పైబడిన వారు స్త్రీలు, పురుషులు కలిపి 6,31,400 మందిఉన్నారన్నారు. సామాజిక పెన్షన్లు, సహాయ జీవన పరికరాలు స్వచ్ఛంద సంస్థలు సహకారంతో పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ పెద్దాపురం అధ్యక్షుడు బివిస్సెన్. మూర్తి, రెడ్ క్రాస్ రాష్ట్ర ప్రెసిడెంట్ వైడి. రామారావు వి.గోపాల నరసరాజు అడబాల రత్నప్రసాద్ ఆచంట రామారాయుడు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ సిటీజన్స్ పాల్గొన్నారు.

### లింగవరం కాలనిలో ఘనంగా

# దేవీ నవరాత్రుల పందిరి రాట మహోత్సవం

**ముఖ్య అతిథిగా హాజరైన వైసిపి ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు**



**ఏలేశ్వరం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఏలేశ్వరం లింగవరం కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నవరాత్రి మహోత్సవాల పందిరి రాట కార్యక్రమం 3వ వార్డు మాజీ కౌన్సిలర్ జువ్వన వీర్రాజు వీర రాఘవమ్మ దంపతుల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు హాజరయ్యారు. వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ఈ పందిరి కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిడగం వెంకటేశ్వరరావు,బదిరెడ్డి గోవింద్, దత్తి రాజా, రాచర్ల రమేష్, కృష్ణార్జునుడు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### కే.కొట్టాం గ్రామంలో

# దేవీ నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ



**కోటనందూరు, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 11వ తేదీ నుండి జరగబోవు దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఈరోజు అంకురార్పణ జరిగింది. కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం కే కొట్టాం గ్రామంలో శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో అర్చకుడు కోటమర్తి శ్రీరామచంద్రమూర్తి వేద మంత్రోచ్చారణల మధ్య లగుడు అప్పలస్వామి వెంకటలక్ష్మి దంపతులచే దేవీ నవరాత్రి ఉత్సవాలకు గణపతి పూజ చేసిన అనంతరము పందిరి రాట ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుండి 10 రోజులు పాటు నవరాత్రి ఉత్సవాలు జరుపుతామని అమ్మవారిని ప్రతిరోజు వివిధ అవతారములలో అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనం ఇస్తారని భక్తులు యావన్మంది ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి కార్యక్రమాలకు సహకరించాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

# శ్రీనివాస నగర్ కాలనీలో ఘనంగా మహా అన్నదానం



**ఏలేశ్వరం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరంపట్టణంలోని శ్రీనివాస నగర్ కాలనీలో వినాయక చవితి ఉత్సవాల అనంతరం గురువారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాలు ముగిసిన అనంతరం గత మూడు సంవత్సరాలుగా సంప్రదాయబద్ధంగా మహా అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు, కాలనీ ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. మహా అన్నదాన కార్యక్రమంలో సుమారు 3,000 మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఆత్మీయంగా అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువతతో పాటు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సత్యదేవుడి హుండీ నెలరోజుల హుండీ ఆదాయం 1.22 కోట్లు



**అన్నవరం, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను లెక్కించారు. సుమారు 30 రోజుల హుండీ ఆదాయంగా రూ.1,22,18, 492 (కోటి, ఇరవై రెండు లక్షల, పది ఎనిమిది వేల, నాలుగు వందల తొంభై రెండు రూపాయలు) లభించినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. హుండీ లెక్కింపులో నగదుతో పాటు 29 గ్రాముల బంగారం, 290 గ్రాముల వెండితో పాటు పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ కూడా లభించినట్లు అధికారులు తెలిపారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది, పురోహితులు కలిసి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యదేవుడిని దర్శించు కునేందుకు వచ్చే భక్తులు స్వామివారికి పెద్ద ఎత్తున కానుకలు సమర్పిస్తుండటం తో హుండీ ఆదాయం గణనీయంగానమోదవుతోంది.

### యండమూరులో ఘనంగా

# అంగన్‌వాడీల ఉత్సవ సేవా సంకల్ప అభియాన్



**కరప, అక్టోబర్ 01, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం యండమూరు గ్రామంలో ఉన్న అంగన్వాడి స్కూల్లో ఘనంగా అంగన్వాడీల ఉత్సవ సేవ సంకల్ప అభియాన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని వై లక్ష్మీ ఆధ్వర్యంలో గొర్రెపూడి సెక్టార్ సూపర్వైజర్ కే విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ లకు వచ్చే పిల్లలకు, తల్లులకు,బాలింతలకు, గర్భిణీలకు, కిషోర బాలికల కు, అందించే పౌష్టికాహారం , పోషణ ఎదుగుదల, రక్తహీనత, పరిశుభ్రత సృజనాత్మకత, చిన్నారులకు ఆటపాటలతో పాటు ఇంగ్లీష్ విద్య బోధన వంటి వాటిపై అవగాహన కల్పించారు అదేవిధంగా అంగన్వాడీ వర్కర్లను హెల్పర్లను పిల్లల తల్లులు మరియు నాయకులు వారిని దుస్సాలువతో సన్మానించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు మారెళ్ళశివ, గంజా దుర్గాప్రసాద్, పలివెల జానకి రామయ్య, మేడిశెట్టి పాండురంగ, గుబ్బల అప్పారావు, పిల్లి లావరాజు, కుక్కల మల్లేశ్వరరావు, ఆచంట పట్టాభి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### 'ది ప్యారడైజ్'కి సంపూర్ణేష్ బాబు
# రెమ్యూనరేషన్ ఎంతో తెలుసా?



దసరా వంటి బ్లాక్ బస్టర్ తర్వాత న్యాచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన సినిమా ' ది ప్యారడైజ్'. సెప్టెంబర్ 24న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా ఇప్పటికే రూ. 160 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. న్యాచురల్ స్టార్ నాని హీరోగా వచ్చిన లేటెస్ట్ పీరియాడికల్ యాక్షన్ మూవీ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ సినిమా సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి రోజు మిక్స్ డ్ టాక్ వచ్చినా ఈ సినిమాకు రికార్డు కలెక్షన్లు వస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు రూ. 160 కోట్లకు పైగాకలెక్షన్లు వచ్చినట్లు ట్రేడ్ నిపుణులు చెబుతున్నారు. ఒక్క తెలుగులోనే కాదు ఇతర భాషల్లోనూ నాని సినిమాకు మంచి కలెక్షన్లు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఓవర్సీస్ లో ది ప్యారడైజ్ సినిమాకు రికార్డు వసూళ్లు వస్తున్నాయి. కాగా మాస్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ది ప్యారడైజ్ సినిమాలో భారీ తారగణమే ఉంది. నాని సరసన కయాదు లోహర్ కథానాయిక గా చేసింది. అలాగే కలెక్షన్ కింగ్ మోహన్ బాబు శికంజా మాలిక్ అనే కరడుగట్టిన విలన్ పాత్రలో భయపెట్టాడు. వీరితో పాటు కామెడీ హీరో, బర్నింగ్ స్టార్ సంపూర్ణేష్ బాబు కూడా ది ప్యారడైజ్ సినిమాలో ఓ కీలక పాత్రలో కనిపించాడు. బిర్యానీ అనే ఓ డిఫరెంట్ పాత్రలో ఆడియెన్స్ ను మెప్పించాడు. ఈ నేపథ్యంలో నాని సినిమా కోసం సంపూ కోసం ఎంత రెమ్యునరేషన్ తీసుకున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. కాగా ది ప్యారడైజ్ సినిమా ప్రమోషన్లలో భాగంగా సంపూర్ణేష్ బాబు రీసెంట్‌గా ఒక ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తన రెమ్యూనరేషన్ గురించి పలు ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నాడు. గతం లో తాను హీరోగా చేసినప్పుడు ఎంత రెమ్యూనరేషన్ ఇచ్చేవారో, ది ప్యారడైజ్ సినిమాకు అంతకు మూడు రెట్లు రెమ్యూనరేషన్ ఇచ్చారని సంపూ చెప్పుకొచ్చాడు. గతంలో ఒక్కో సినిమాకు కోటి రూపాయలు పైనే పారితోషికం తీసుకున్నాడు బర్నింగ్ స్టార్. ఈ నేపథ్యంలో ది ప్యారడైజ్ సినిమా కోసం సంపూ సుమారు రూ. 3 కోట్లకు పైగానే రెమ్యూనరేషన్ తీసుకున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్ గా మారింది.

# 'కేబీసీ 18' షూటింగులో అమితాబ్‌కు గాయం.. ఇప్పుడెలా ఉన్నారంటే?

బాలీవుడ్ సీనియర్ నటుడు, బిగ్ బీ అమితాబ్ బచ్చన్ 83 ఏళ్ల వయసులోనూ చాలా చురుకుగా ఉంటారు. ఇప్పటికీ సినిమాలు, రియాలిటీ షో హోస్టింగులతో ఆయన బిజీగా ఉంటున్నారు. అయితే తాజాగా 'కౌన్ బనేగా కరోడ్‌పతి 18' షూటింగ్ సమయంలో బిగ్ బీ గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా పంచుకున్నారు. బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్ బచ్చన్ గాయపడ్డారు. 'కౌన్ బనేగా కరోడ్‌పతి 18' రియాలిటీ షో షూటింగ్ సమయంలో భాగంగా ప్రమాదవశాత్తూ ఆయన కింద పడ్డారు. దీంతో బిగ్ బీకి మోకాలికి గాయమైంది. ఈ విషయాన్ని బిగ్ బీనే స్వయంగా ఆ షో తాజా ఎపిసోడ్‌లో వెల్లడించారు. సాధారణంగా కేబీసీ షో ప్రారంభంలో అమితాబ్ బచ్చన్ వేదిక మధ్యలో నిలబడి ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగిస్తారు , కానీ ఈసారి గాయం కారణంగా ఆయన కూర్చొని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎపిసోడ్ ప్రారంభంలో, వేదిక వద్దకు అక్కడి సీటులో కూర్చున్న అమితాబ్, ఆ సంఘటనను వివరిస్తూ, 'సాధారణంగా నేను వేదిక మధ్యలో నిలబడి నా ప్రారంభోపన్యాసం ఇస్తాను. కానీ ఈరోజు నా మోకాలికి గాయమైంది. నిన్న షూటింగ్ చేస్తుండగా జారిపడి నా ఎడమ మోకాలికి దెబ్బ తగిలింది' అని చెప్పుకొచ్చారు. బిగ్ బి గాయపడ్డారన్న వార్త విన్న వెంటనే సెట్‌లోని ప్రేక్షకులు కంగారుపడ్డారు. కానీ అమితాబ్ వెంటనే ప్రేక్షకులను ఓదార్చుతూ, 'గాయం అంత తీవ్రమైనది కాదు. పోటీదారులను వేదికపైకి ఆహ్వానించేటప్పుడు నేను నిలబడతాను. కానీ ప్రస్తుతం, నిలబడటానికి కొంచెం కష్టంగా ఉన్నందున కూర్చుంటున్నాను' అని అన్నారు. దీంతో కేబీసీ కంటెస్టెంట్స్, ప్రేక్షకులు బిగ్ బీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



**వరుస సినిమాలతో బిజీ బిజీగా ఉంటోన్న బిగ్ బీ**

83 ఏళ్ల అమితాబ్ బచ్చన్ ఇప్పటికీ చురుకుగా ఉంటున్నారు అమితాబ్ బచ్చన్. ప్రస్తుతం ఆయన పెద్ద ప్రాజెక్టులతో బిజీ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం రిభు దాస్‌గుప్తా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సెక్షన్ 84' అనే కోర్ట్‌రూమ్ డ్రామాలో అమితాబ్ బచ్చన్ లీడ్ రోల్ లో నటిస్తున్నారు. ఇందులో డయానా పెంటీ, నిమ్రత్ కౌర్, అభిషేక్ బానర్జీ కూడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ దశలో ఉంది. ఇది కాకుండా ప్రభాస్- నాగ్ అశ్విన్ సూపర్ హిట్ 'కల్కి 2898-ఏడీ' రెండవ భాగంలో అమితాబ్ అశ్వత్థామ పాత్రను కొనసాగించనున్నారు. ఈ చిత్రంలో ఆయన ప్రభాస్, కమల్ హాసన్‌లతో కలిసి కనిపించనున్నారు. 'ఆంఖేన్ 2' చిత్రంలో కూడా బిగ్ బి నటించనున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్టులకు సంబంధించి మరిన్ని అప్డేట్స్ రానున్నాయి.

# టాక్.. ట్రాక్ మార్చబోతున్న అనీల్ రావిపూడి?



టాలీవుడ్ వరుస విజయ సినిమాల దర్శకుడు అనీల్ రావిపూడి అంటే మొదట గుర్తొచ్చేది తన మార్కు ఎంటర్టైన్మెంట్ తో కూడిన కమర్షియల్ సినిమాలే.. అదే తన స్ట్రాంగ్ జోన్ అని కూడా తాను పలుమార్లు చెప్పారు. ఇలా తనకి బాగా వచ్చిన ట్రాక్ లోనే సినిమాలు చేస్తూ వచ్చిన అనీల్ ఇప్పుడు ట్రాక్ మారుస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. ఈసారి పూర్తిగా తన ఫార్మాట్ కి విరుద్ధంగా ఓ యానిమేషన్ సినిమా చేయనున్నట్టు రూమర్స్ వినిపిస్తున్నాయి. పైగా రామాయణం లాంటి ప్రాజెక్ట్ ని తను టేకప్ చేస్తున్నట్లు రూమర్స్ వినిపిస్తున్నాయి. ఇది ఒకింత ఆశ్చర్యకరమైన విషయమే అని చెప్పాలి. కేవలం కామెడీ మాత్రమే కాకుండా భగవంత్ కేసరి లాంటి సాలిడ్ సీరియస్ సబ్జెక్ట్ లు తను చెయ్యగలరు అని ఆల్రెడీ ప్రూవ్ చేశారు. సో ఇది కూడా చేసినా ఆశ్చర్యం లేదు. మరి ఈ ఇంట్రెస్టింగ్ డెవలప్మెంట్ పై మాత్రం మరింత క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ప్రస్తుతం అనీల్ హీరోలు వెంకీ మామా, తన మొదటి హీరో కళ్యాణ్ రామ్ లతో జనవరి 12 విడుదల సినిమాతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.

### సరికొత్త క్రియేటివ్ ఆఫీస్‌తో
# కొత్త అధ్యాయం మొదలుపెట్టిన అల్లు అర్జున్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కెరీర్‌లో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. తన తాత, దిగ్గజ నటుడు అల్లు రామలింగయ్య జయంతిని పురస్కరించుకుని సరికొత్త క్రియేటివ్ ఆఫీస్ స్పేస్ 'ICONZA'ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాతయ్య ఆశీస్సులతో ఈ నూతన కార్యాలయాన్ని ఆరంభించడం పట్ల అల్లు అర్జున్ హర్షం వ్యక్తం చేశారు. "A new space. A new chapter. A legacy that continues" అంటూ సోషల్ మీడియా వేదికగా ఈ విశేషాన్ని పంచుకున్నారు. ఈ వేడుకలో అల్లు అరవింద్, అల్లు శిరీష్, అల్లు బాబీ సహా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. క్రియేటివ్ ఆలోచనలు, వినూత్న ప్రాజెక్టుల రూపకల్పన లక్ష్యంగా ఈ ఆఫీస్ స్పేస్‌ను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. తాతయ్య జయంతి రోజే ఈ కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టడంతో అటు చిత్ర పరిశ్రమ వర్గాలు, ఇటు అభిమానుల నుంచి బన్నీకి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

# ఒకే చోట 'డబుల్' ధమాకా వీరులు.. గిల్ - రోహిత్ స్పెషల్ చిట్‌చాట్

వెస్టిండీస్‌తో రెండో వన్డే మ్యాచ్‌లో కెప్టెన్ శుభమన్ గిల్ రికార్డు డబుల్ సెంచరీ.. అతడితోపాటు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ సెంచరీ సాధించి చరిత్రలో నిలిచిపోయే విజయాన్ని భారత్‌కు అందించారు. వీరిద్దరూ కలిసి మాట్లాడిన వీడియోను బీసీసీఐ షేర్ చేసింది. గిల్ ఇన్నింగ్స్‌పై రోహిత్ ప్రశంసల వర్షం కురిపించారు. రోహిత్ భాయ్ సెలబ్రేషన్స్ బాగున్నాయంటూ గిల్ కూడా కితాబిచ్చాడు.

**రోహిత్:** క్రికెట్ కెరీర్‌లో శుభ్‌మన్ గిల్‌కు ఈ క్షణాలు అద్భుతమైన జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. అతడు ఎంత బాగా ఆడాడో మనమంతా చూశాం. పూర్తి నియంత్రణతో ఎలాంటి టెన్షన్ పడకుండా తొలి బంతి నుంచి చివరి వరకూ మంచి ప్రదర్శన ఇచ్చాడు. తొలుత 50 ఓవర్లపాటు ఫీల్డింగ్ చేయడమే కాకుండా.. ఆ తర్వాత భారత ఇన్నింగ్స్ చివరి వరకూ క్రీజ్‌లో ఉండటం మాములు విషయం కాదు. ఇదంతా ఏకాగ్రతతో కూడిన అతడి నిబద్ధతకు నిదర్శనం. తనపై నమ్మకం ఎక్కువ. డబుల్ సెంచరీలు అనేవి కెరీర్‌లో ఎక్కువ సార్లు రావు. ఆ ఇన్నింగ్స్‌ను ఆస్వాదించాలి.

**గిల్:** ఓ వైపు ఓపెనర్‌గా రోహిత్ భాయ్ ఉండటం వల్ల నా పని తేలికైంది. ఈ పిచ్ మీద తొలి పవర్ ప్లేలోనే వికెట్ నష్టపోకుండా కనీసం 80 పరుగులు చేయాలనుకున్నాం. అలాగే చేశాం. పవర్ ప్లే తర్వాత కూడా రోహిత్ దూకుడు ప్రదర్శించాడు. నేను కూడా జోరందుకున్నా. నాకిష్టమైన జోన్‌లో బంతి పడితే బౌండరీ పంపించడంపైనే దృష్టిపెట్టా.



**రోహిత్:** మేం ఎప్పుడు బరిలోకి దిగినా మా లక్ష్యం ఒకటే. ఒక్కో మ్యాచ్‌ను గెలవాలి. ఒక్కో సిరీస్ నెగ్గుతూ వెళ్లాలి. ఇక్కడ పిచ్ నుంచి పెద్దగా సవాల్ ఎదురుకాలేదు. కానీ, వాతావరణం మాత్రం ఇబ్బందిపెట్టింది. ఈ మ్యాచ్‌తో నాకు మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది.

**గిల్:** మేం ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు ఉక్కపోత చాలా ఇబ్బంది పెట్టింది. 13 ఓవర్లకే చాలా అలసిపోయాం. మ్యాచ్‌లో సగం ఓవర్లు ముగిశాయేమో అనుకున్నా. ఇక్కడి వాతావరణం వల్లే అలా అనిపించింది.

**రోహిత్:** ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సెంచరీ సాధించడం సంతోషంగా అనిపిస్తోంది. భారీ లక్ష్యం ఉన్నప్పుడు జట్టు కోసం పోరాటం చేసేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటా. ఇక గిల్ పరిస్థితి పూర్తిగా భిన్నమైంది. అతడు 50 ఓవర్లపాటు ఫీల్డింగ్ మాత్రమే కాదు.. కెప్టెన్‌గానూ అతడిపై చాలా ఒత్తిడి ఉంటుంది. వాటిని ఎదుర్కొని మరీ సుదీర్ఘమైన ఇన్నింగ్స్ ఆడటం తేలిక కాదు. అది అతడితోపాటు జట్టుకూ గొప్ప సానుకూలాంశం. ఇక సంబరాలు అంటారా.. అవి పూర్తిగా వ్యక్తిగతం. ఎందుకు చేశామనేది ప్రతిసారీ వచ్చి వివరణ ఇవ్వలేం. గిల్ ఏం సెలబ్రేట్ చేశాడో అతడి పర్సనల్. అలాగే నాది కూడా..

**గిల్:** రోహిత్ భాయ్ అలా సంబరాలు చేసుకోవడం నచ్చింది. అతడు ఎప్పుడూ హెల్మెట్ ఎక్కువగా తీయడు. అలాగే పెద్దగా సంబరాలు కూడా చేసుకోడు. కానీ, ఈసారి మాత్రం అలా చేయడం భలేగా అనిపించింది.

# భారత్/పాక్.. వారికి ఓకే.. క్రికెట్‌లో 'హ్యాండ్‌షేక్' ఉంటుందా?




భారత్ - పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య మరోసారి పోరు జరగనుంది. ఈసారి ఆసియా క్రీడల్లో స్వర్ణం కోసం తలపడనున్నాయి. ఇరు జట్ల మ్యాచ్ అనగానే ఠక్కున గుర్తుకొచ్చేది కరచాలనం అంశం. మరి ఇప్పుడైనా 'షేక్‌హ్యాండ్' ఇచ్చుకుంటారా? ఇతర క్రీడల్లో ఇరు దేశాల అథ్లెట్ల సంగతేంటి? ఆసియా క్రీడల రూల్స్ ఏం చెబుతున్నాయి? అనే విషయాలపై ఓ లుక్కేద్దాం..

పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో ఏ క్రికెట్ మ్యాచ్ జరిగినా భారత ప్లేయర్లు కరచాలనం చేయడం లేదు.

ఇటీవల ఆసియా క్రీడల్లోనూ ఇదే ఆనవాయితీ కొనసాగించారు. ఇటు మహిళలు, అటు పురుషుల క్రికెట్‌లో ఇలా జరుగుతోంది.

ఇప్పుడు ఆసియా గేమ్స్‌లోనూ భారత్ - పాకిస్థాన్ పురుషుల జట్టు ఫైనల్‌లో తలపడేందుకు సిద్ధమవుతున్నాయి. ఇతర టోర్నీలతో పోలిస్తే ఇది భిన్నమైన వేదిక.

ఆసియా క్రీడల్లో ప్రత్యర్థి ఆటగాళ్లతో తప్పనిసరిగా కరచాలనం చేయాలనే రూల్ లేదని తెలుస్తోంది. కాకపోతే.. ఇక్కడ క్రీడా స్ఫూర్తి అనేది కీలకం.

ఉక్రెయిన్ - రష్యా, బెలారస్ క్రీడాకారులు కూడా ఒకరికొకరు షేక్ హ్యాండ్ ఇచ్చుకోలేదు. అక్కడ యుద్ధం జరుగుతోన్న సంగతి తెలిసిందే.

పాకిస్థాన్ విషయంలో భారత క్రికెట్ జట్టు ఇలాగే వ్యవహరించనుంది. ఇక ఫైనల్ మ్యాచ్‌కు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా రానున్నారు. ఐసీసీ ఛైర్మన్ జైషా కూడా హాజరవుతారని సమాచారం.

క్రికెట్ మినహా.. మిగతా క్రీడల్లో భారత్ - పాకిస్థాన్ అథ్లెట్లు గౌరవార్థం కరచాలనం చేసుకోవడం గమనార్హం. టేబుల్ టెన్నిస్, స్క్వాష్‌లోనే ఇలానే షేక్ హ్యాండ్ ఇచ్చారు.

ఫైనల్ మ్యాచ్ ముగిసిన తర్వాత.. పోడియం మాత్రం ఇరు దేశాల క్రికెటర్లు పంచుకోవాల్సి ఉంటుంది. మహిళా క్రికెట్ జట్టు కూడా పాకిస్థాన్ టీమ్‌తో పోడియం ఎక్కిన సంగతి తెలిసిందే.

# క్రికెట్ నిబంధనల్లో సవరణలు..

### 'అఫీషియల్ లాస్ ఆఫ్ క్రికెట్' యాప్‌లో వివరాలు




క్రికెట్లో బ్యాటు, బంతి మధ్య సమతుల్యత పాటించడానికి కట్టుబడి ఉన్నామని మర్లెల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎమ్‌సీసీ) హెడ్ ఆఫ్ క్రికెట్ ఫ్రేసర్ స్టీవార్ట్ పేర్కొన్నాడు. అందుకోసం ఎమ్‌సీసీ కృషి చేస్తుందని అతడు అన్నాడు. కొత్త క్రికెట్ నియమాలు గురువారం నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో స్టీవార్ట్ దిల్లీలో జరిగిన అంపైర్ల వర్క్‌షాప్‌లో మాట్లాడాడు. దాదాపు 73 నిబంధనల్ని సవరించినట్లు తెలిపాడు. ఉదాహరణకు ఎర్రబంతి ఫార్మాట్లో ఆఖరి ఓవర్లో వికెట్ పడితే, మిగతా బంతుల్ని ఎదుర్కొనేందుకు తర్వాతి బ్యాటర్ మైదానంలోకి రావాల్సివుంటుంది. కొత్త నియమాలపై అందరికీ అవగాహన పెంచేందుకు 'అఫీషియల్ లాస్ ఆఫ్ క్రికెట్' యాప్‌ను రూపొందించింది. వివిధ భాషల్లో ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. తెలుగువాడు శ్రీకాంత్ టంగుటూరికి చెందిన రీబుల్ సంస్థ ఈ యాప్‌ను తయారుచేసింది. అక్టోబరు మొదటి వారంలో పలు నగరాల్లో ఎంసీసీ సెమినార్లు కూడా నిర్వహించనుంది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com